క్లుప్తంగా

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుడివాడరూరల్: ఈ నెల 19వ తేదీన కృష్ణా జిల్లా వేమవరం శరత్‌చంద్ర ఎంఎస్ఆర్ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ఎం.సత్యారామ్ తెలిపారు. 11 సంవత్సరాల బాలుర వ్యక్తిగత కటా విభాగంలో పాఠశాలకు చెందిన పి.సాయిహర్షిత్ మూడో స్థానం, 10 సంవత్సరాల బాలుర వ్యక్తిగత కటా విభాగంలో డి.జిగ్నేష్ ద్వితీయస్థానం, తొమ్మిది సంవత్సరాల బాలికల వ్యక్తిగత కటా విభాగంలో ఎం.గ్రేష్మ మూడో స్థానం సాధించి పాఠశాల ఖ్యాతిని ఇనుమడింపజేశారన్నారు. విద్యార్థులు విజయం సాధించేందుకు తర్ఫీదు ఇచ్చిన కోచ్ వెంకటేశ్వరరావు విజేతలను పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, జబ్రీన్ అభినందించారు.

పేదలకు వైఎస్సార్ బీమా వరం



గుడివాడరూరల్: పేదలకు వైఎస్సార్ బీమా పథకం ఓ వరం లాంటిదని ఎంపీపీ పెయ్యల ఆదాం పేర్కొన్నారు. నందివాడ మండలం నందివాడలో ఇటీవల మరణించిన షేక్ సుభానీకి వైఎస్సార్ బీమా ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం వచ్చిన రూ.10 వేలను ఎంపీపీ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.రత్నకుమారి, ఉప సర్పంచ్ రాజులపాటి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి రామ్మోహనరావు, వార్డు సభ్యులు సాగర్, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



గుర్విందగుంట(పెదపారుపూడి): మండలంలోని గుర్విందగుంటలో రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ, ఉయ్యూరు రోటరీ క్లబ్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత దంత, నేత్ర శిబిరం నిర్వహించారు. సుమారు 140 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. నేత్ర పరీక్షలు అనంతరం కళ్ల జోళ్లు అవసరమైన వారికి వచ్చే నెల 7వ తేదీన అందిస్తామని క్లబ్ నిర్వహకులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ గుడివాడ అధ్యక్షుడు రమణమూర్తి, అసిస్టెంట్ గవర్నర్ రెడ్డియ్య చౌదరి, సెక్రటరీ నరేష్, ట్రెజరర్ కిరణ్, సభ్యులు సుజీత్‌ప్రేమ్, సుబ్రహ్మణేశ్వరరావు, వైద్యులు రమ్యభవాని, శిరీష, పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఎస్సీ, బీసీలకు ప్రాధాన్యం

గుడ్లవల్లేరు: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎస్సీ, బీసీల వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉప్పాల రాంప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన గుడ్లవల్లేరులో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీల పదవుల్లో బీసీ, ఎస్సీలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని కొనియాడారు.

సచివాలయాల మండల కన్వీనర్‌గా జాజుల చిన్నారి



పెదపారుపూడి: మండల సచివాలయాల కన్వీనర్‌గా జాజుల సుబ్రహ్మణ్యం (చిన్నారి)ను ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని చినపారుపూడి కల్యాణ మండలంలో బుధవారం జరిగిన గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్యే చిన్నారిని సచివాలయాల కన్వీనర్‌గా పేరును ప్రకటించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కన్వీనర్‌గా ఎంపికైన జాజుల చిన్నారిని అభినందించారు.

కొండలమ్మను దర్శించుకున్న జయమంగళ

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారిని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకట రమణ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో చైర్మన్ శేషం గోపి, ఈఓ సురేష్ స్వాగతం పలికారు. ఆయన పేరిట ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సన్మానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, బూత్ కమిటీల మండల కన్వీనర్ బలుసు జితేంద్ర పాల్గొన్నారు.

శరవేగంగా జలజీవన్ మిషన్ పనులు

- మండలానికి రూ.11.59 కోట్ల మంజూరు
- 90 శాతం పనులు పూర్తి
- ఇంటింటికీ కుళాయి ఏర్పాటుతో తీరనున్న తాగునీటి కష్టాలు



శేరీగొల్వేపల్లిలో ఏర్పాటు చేసిన కుళాయిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు



జరుగుతున్న పైప్‌లైన్ నిర్మాణ పనులు

గుడివాడరూరల్: ఇంటింటికీ కుళాయి ఏర్పాటు కల మండలంలో సాకారం కానుంది. దశాబ్దాల కాలంగా తాగునీటి కోసం మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు ప్రభుత్వం పరిష్కారం చూపింది. గ్రామాల్లో ఉన్న ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు జలజీవన్ మిషన్‌లో భాగంగా నిధులు మంజూరు చేయడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పైప్‌లైన్ల నిర్మాణంతో పాటు ఇంటింటికీ కుళాయి ఏర్పాట్లు ఇప్పటికే 90 శాతం మేర పూర్తి కావడంతో గ్రామాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి ఇంటికీ కుళాయి ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జలజీవన్ మిషన్‌లో భాగంగా మండలంలో ఉన్న 21 పంచాయతీల్లో ఉన్న 41శివారు గ్రామాలను కలుపుకుని పైప్‌లైన్ల నిర్మాణం, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం, కుళాయిల ఏర్పాటుకు గాను ప్రభుత్వం రూ.11.59 కోట్లు మంజూరు చేసింది. వాస్తవానికి గతంలో గ్రామాల్లో పబ్లిక్ కుళాయిలు మాత్రమే ఉండేవి. ఎవరైనా సొంతంగా కుళాయిలు ఏర్పాటు చేసుకోవాలంటే గ్రామాల్లో వేలరూపాయిలు పంచాయతీలకు అనుమతుల కోసం రుసుం చెల్లించి సొంత నిధులతో ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చేది. ఆర్థికంగా స్థోమత ఉన్న వారు కుళాయిలను ఏర్పాటు చేసుకునేవారు. ఆర్థిక స్థోమత లేనివాళ్లు పబ్లిక్ కుళాయిల వద్ద నీటి కోసం పడిగాపులు పడాల్సిన దుస్థితి ఉండేది. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ప్రజలు పడుతున్న తాగునీటి కష్టాలను పట్టించుకున్న దాఖలాలు లేవు. స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా నిధులు మంజూరు చేయించడంతో తాగునీటి కష్టాలకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందులో భాగంగా జలజీవన్ మిషన్ పనులకు మండలంలో అధిక ప్రాధాన్యం కల్పించారు. గ్రామాల్లో ఉన్న ప్రతి శివారు ప్రాంతానికి తాగునీరు సక్రమంగా అందేలా పైప్‌లైన్ నిర్మాణం, ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం, ప్రతి ఇంటికీ కుళాయిల ఏర్పాటుకు గాను వలివర్తిపాడు దళితవాడకు రూ.24.72 లక్షలతో 100 కుళాయిలు, లింగవరం గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్, ఇంటింటికీ కుళాయిలకు రూ.79.84 లక్షలతో 372 కుళాయిలు, దొండపాడుకు రూ.1,47,29,000లతో 432 కుళాయిలు. సైదేపూడిలో రూ.3.5లక్షలతో 14 కుళాయిలు, శేరీగొల్వేపల్లిలో రూ.7.9 లక్షలతో 59 కుళాయిలు, గుంటాకోడూరులో రూ.5.9 లక్షలతో 33 కుళాయిలు, మోటూరులో రూ.69.58 లక్షలతో 91 కుళాయిలు, మల్లాయపాలెంలో రూ.84.76 లక్షలతో 374 కుళాయిలు, బిళ్లపాడులో 100 కుళాయిల నిర్మాణానికి రూ.26.13 లక్షలు, బొమ్ములూరులో 75 కుళాయిల నిర్మాణానికి రూ.19లక్షలు, సిద్ధాంతంలో 2 కుళాయిల నిర్మాణానికి రూ.2లక్షలు, కొత్త చౌటపల్లికి 8 కుళాయిలకు రూ.1.5లక్షలు, కల్వపూడి అగ్రహారానికి 53 కుళాయిలకు రూ.22.78లక్షలు, శేరీదింటకుర్రులో 15 కుళాయిలకు రూ.2.50 లక్షలు, శేరీవేల్పూరులో 10 కుళాయిలకు రూ.2.50 లక్షలు, నూజెళ్లలో 12కుళాయిలకు రూ.2.25 లక్షలు, తటివర్రులో రూ.47.67 లక్షలతో 130కుళాయిలు, సీపూడిలో రూ.22.17లక్షలతో 200 కుళాయిలు, రామనపూడిలో రూ.56లక్షలతో 125కుళాయిలు మంజూరు చేశారు. ఇప్పటికే పనులు పూర్తయ్యాయి. కాగా టెండర్లు పూర్తయ్యి పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా చిరిచింతలకు రూ.5.81, చౌటపల్లి దళితవాడకు రూ.61.52లక్షలు, వలివర్తిపాడు మెయిన్ గ్రామానికి రూ.57.47లక్షలు, బొమ్ములూరు పంచాయతీ పరిధిలోని గంగాదరపురానికి రూ.27.75 లక్షలు మంజూరయ్యాయి. అదే విధంగా మల్లాయపాలెం రూ.1.11కోట్లు, చౌటపల్లికి రూ.68.9 లక్షలు, బిళ్లపాడుకు 39లక్షలు, బొమ్ములూరుకు రూ.56.9 లక్షలు కేటాయించగా పనులు ప్రారంభించేందుకు టెండర్లు పిలవాల్సి ఉంది. పర్నాసలో రూ.27.4 లక్షలు, చిన ఎరుకపాడులో రూ.20 లక్షల వ్యయంతో నిర్మాణ పనులు పురోగతి దశలో ఉన్నాయి.

చక్కటి నిర్ణయం



గ్రామాల్లో సొంతంగా కుళాయి ఏర్పాటు చేసుకోవాలంటే పేదలకు భారంగా ఉండేది. వీధుల్లో ఉన్న పంచాయతీ కుళాయిల నుంచి నీటిని తెచ్చుకోవడం కోసం గొడవలతో పాటు పడిగాపులు పడాల్సి వచ్చేది. ప్రభుత్వం చక్కటి నిర్ణయం తీసుకుని, ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయడంతో ఎంతో మందికి మేలు జరుగుతుంది. పేదలకు ఈ పథకం వరం లాంటిది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–మేకల సత్యనారాయణ, గుంటాకోడూరు


తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు



ప్రభుత్వం జలజీవన్ మిషన్‌లో భాగంగా మండలానికి కేటాయించిన నిధులతో పనులను వేగంగా చేస్తున్నాం. ఇంటింటికీ కుళాయిల నిర్మాణ పనులు ఇప్పటికే 90 శాతం మేర పూర్తి చేశాం. ఓవర్‌హెడ్ ట్యాంక్, పైప్‌లైన్ల నిర్మాణ పనులు 19 గ్రామాల్లో ఇప్పటికే పూర్తి చేశాం. మిగిలిన రెండు గ్రామాల్లో పనులను త్వరలోనే ప్రారంభించి ప్రజలకు తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటాం. పనులను నాణ్యతా ప్రమాణాలతో రాజీ పడకుండా చేస్తున్నాం.

–అట్లూరి వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి డీఈ

వచ్చే నెల 5న వార్షిక కల్యాణ మహోత్సవం



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల 260వ వార్షిక కల్యాణ మహోత్సవాన్ని మార్చి 5వ తేదీన నిర్వహించనున్నట్లు దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. బ్రహ్మశ్రీ రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి పర్యవేక్షణలో మార్చి రెండు నుంచి 8వ తేదీ వరకు కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 2, 3 తేదీల్లో అమ్మవారిని, అయ్యవారిని పెండ్లి కొడుకులుగా చేయటం, 4న గ్రామోత్సవం, 5వ తేదీ రాత్రి 11 గంటలకు శ్రీ బాలా త్రిపుర సుందరీ అమ్మవారి, శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవం, 6వ తేదీ 11.30కి కల్యాణ అన్నప్రసాద వితరణ, రాత్రి 9 గంటలకు రథోత్సవం, 7న వసంతోత్సవం, శేష వాహనంపై గ్రామోత్సవం, 8న పవళింపు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

గృహాలు వెంటనే నిర్మించుకోండి

గుడ్లవల్లేరు: జగనన్న కాలనీలో గృహాలు వెంటనే నిర్మించుకోవాలని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ పేర్కొన్నారు. కౌతవరంలో మహిళా గృహ లబ్ధిదారులకు ఆయన బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు ప్రభుత్వం కల్పించే ఆర్థికసాయంతో పాటు స్టీలు, సిమెంట్ ఉపయోగాలను విశదీకరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లమూడి చిన్ని, కార్యదర్శి సీహెచ్.ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ క్రాంతి పథం కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రజియా, హేమంత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

ఎమ్మెల్యే అనిల్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

తోట్లవల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. విద్య, వైద్యం, వ్యవసాయం, హౌసింగ్, ఐసీడీఎస్, ఉపాధిహామీ, ఆర్టీసీ, ఎక్సైజ్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, వెటర్నరీ, ట్రాన్స్‌కో, తాగునీరు, వెలుగు, ఇరిగేషన్, డ్రెయినేజీ, తదితర శాఖల అధికారులతో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ శాఖల వారీగా సమీక్షించారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించగలిగినప్పుడే సమావేశానికి విలువ ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలు రానున్న సమావేశం లోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. అధికారులు సమావేశాలకు వచ్చేటప్పుడు సమగ్ర సమాచారంతో రావాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సక్రమంగా పనిచేయకుండా ప్రతిదాన్నీ ప్రభుత్వంపై రుద్దటం సరికాదన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. న్యాయబద్ధమైన గిట్టుబాటు ధర అందించడంతోపాటు దళారీ వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గడపగడపలో ఎదురైనా సమస్యల పరిష్కారానికి ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు ఇస్తోందన్నారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. తోట్లవల్లూరులో ఇళ్ల స్థలాల కోసం మరో 10 ఎకరాల భూమిని సేకరించేందుకు కలెక్టర్ అనుమతి ఇచ్చారని తెలిపారు. జగనన్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, ఎంఈఓ వెంకటేశ్వరరావు, పీఆర్, హౌసింగ్, ట్రాన్స్‌కో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు రాఘవరావు, భవానీప్రసాద్, దేవదాస్, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. స్థానిక సీతారామ ఫంక్షన్ హాల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు రెండో రోజు సమీక్ష సమావేశం బుధవారం ఎంపీపీ అడవి కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విధి విధానాలను పూర్తిగా ఆకళింపు చేసుకుని సీఎం జగనన్న సంకల్పం సిద్ధించేలా కృషి చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో ముందున్నామంటే పార్టీ కుటుంబ సభ్యుల ప్రోత్సహమే అని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వ్యక్తులకే పథకాలు అందించారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. టీడీపీ మాజీ ఇన్‌చార్జి జయమంగళ వెంకటరమణ వైఎస్సార్ సీపీలోకి రావడం ఎంతో సంతోషమని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ఇరువురం కలిసి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, మార్కెట్ యార్డ్ చైర్మన్ దండే పుష్పలత, వైస్ ఎంపీపీ మహ్మద్ జహీర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బత్రాజు శివాజీ, ఏఎంసీ వైస్ చైర్మన్ జంపన కొండరాజు, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, కైకలూరు సర్పంచ్ నవరత్నకుమారి, ఎంపీటీసీ సభ్యులు మంగినేని రామకృష్ణ, మూడెడ్ల శశికళ, బోడిచర్ల స్వాతి, పట్టపు బాలమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రామారావు, సర్పంచ్‌లు, నాయకులు హమీద్, రఫీ, తలారి జాన్, లక్ష్మణ్, సాయి, సతీష్ పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా వలంటీర్ వ్యవస్థ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

చినపారుపూడి: ముఖ్యమంత్రి సచివాలయాల్లో ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా మారిందని, అలాగే గృహ సారథులు కూడా కీలకంగా మారటం తథ్యమని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని చినపారుపూడిలోని కల్యాణ మండపంలో బుధవారం సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథుల ఆత్మీయ సమేశన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను అమలు చేసిన దేశంలోనే ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదల కోసం పార్టీలకు కులాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు పేర్కొన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్..

మార్చి 18 నుంచి 26వ తేదీ వరకు గృహ సారథులు వారికి నిర్దేశించిన ఇళ్లకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు 'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో ఉన్న సిక్టర్‌ను అంటించాలని ఎమ్మెల్యే సూచించారు. జేసీఎస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ కందుల రవీంధర్‌రెడ్డి, ఎంపీపీ గోగం సురేష్, పీఏసీఎస్ బ్యాంక్ అధ్యక్షుడు కోటేశ్వరరావు, మూల్పూరి నరేంద్ర, పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్లు సుజాత, గోళ్ల వెంకటేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ జాజుల చిన్నారి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

25న మినుము కొనుగోలు కేంద్రం ఏర్పాటు

మండవల్లి: మండలంలోని ఒక గ్రామంలో మినుము కొనుగోలు కేంద్రం ఈ నెల 25న ఏర్పాటు చేయనున్నట్లు ఏఓ షేక్ జరీనా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్వింటాల్ ధర రూ.6,600 చెల్లిస్తారని, ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని తెలిపారు.

విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే డీఎన్నార్



గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు(కలిదిండి): గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. వెంకటాపురం ఎస్సీ వాడలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరు నంబూరి శ్రీదేవి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మూడున్నరేళ్లలో లబ్ధిదారులకు అందించిన సంక్షేమ పథకాల వివరాలు తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. విద్యుత్ స్తంభాలు, రహదారుల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ దళిత వాడలో 240 మీటర్ల పరిధిలో తక్షణం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని మండల ఎలక్ట్రికల్ ఏఈ మల్లికార్జున్‌కు ఆదేశించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఎస్సీ వాడలో ఎల్‌టీ లైన్ ఏర్పాటుకు రూ.లక్షా 40 వేల అంచనాలు రూపొందించామన్నారు. త్వరలో పనులు పూర్తి చేస్తామని తెలిపారు. గ్రామస్తులు 100 మీటర్ల సీసీ రోడ్డు వేయాలని కోరగా ఎమ్మెల్యే రోడ్లు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెట్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ అయినాల బ్రహ్మాజీరావు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు కనకదుర్గారాణి, నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవి కుమార్, సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడు గద్దె ఆనంద్ కుమార్, డాక్టరు జాన్ విక్టర్, నంబూరి బాబి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన ఇలా..

కైకలూరు: ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) గురువారం పర్యటించే వివరాలను కార్యాలయ సిబ్బంది వెల్లడించారు. మధ్యాహ్నం రెండు గంటలకు కలిదిండి మండలం గోపాలపురంలో నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు.

బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయం



విలేకరులతో మాట్లాడుతున్న గొర్ల, బీసీ సంఘాల నాయకులు

గుడివాడరూరల్: ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు అధికంగా కేటాయించి మరోమారు బీసీలపై ఉన్న ప్రేమను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాటుకున్నారని వైఎస్సార్ సీపీ బీసీ సంఘ నాయకులు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీలపై తనకున్న అభిమానాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల్లో 18 సీట్లకుగాను 11బీసీలకు కేటాయించి అభిమానాన్ని చాటారన్నారు. బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్న చంద్రబాబు వారికి ఎప్పుడు ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సైతం నియోజకవర్గంలో పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవులను సైతం బీసీలకు ఇచ్చి వారికి సముచితమైన గౌరవాన్ని ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అధిక ప్రాదాన్యం ఇచ్చి అన్ని రకాల పదవులను కట్టబెట్టారన్నారు. రాజ్యసభతో పాటు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సీట్లను ఎక్కువగా బీసీలకే ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. బీసీలు ముఖ్యమంత్రి రుణం తీర్చుకోవాలంటే మరోమారు ఆయన్ను సీఎం సీట్లో కూర్చోబెట్టాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి బీసీలు మద్దతు పలికి సీఎం రుణం తీర్చుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ తోట నాగరాజు, గుంటాకోడూరు ఎంపీటీసీ అంగడాల శ్రీరామాంజనేయులు, నందివాడ మండల వైస్ ఎంపీపీ పూడి సుధాకర్, బీసీ సంఘాల నాయకులు కందుల నాగరాజు, నైనవరపు శేషబాబు, చింతాడ నాగూర్, జూనియర్ జమదగ్ని పాల్గొన్నారు.

మంత్రి జోగి రమేష్‌ను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి



మంత్రి జోగి రమేష్‌తో ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ

కైకలూరు: ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ ముదినేపల్లిలో జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ విషయాలపై కొద్ది సమయం ముచ్చటించుకున్నారు. అదేవిధంగా జయమంగళ నివాసం వద్ద కలిదిండి మండలం పెదలంకలో జరిగే పెద్దింట్లమ్మవారి 54వ వార్షిక మహోత్సవాల పోస్టర్‌ను నిర్వాహకులతో కలిసి విడుదల చేశారు.